ఆర్భాటం.. అలసత్వం

నత్త నడకన సమీకృత మార్కెట్ల నిర్మాణాలు

- మంజూరైనవి 8, పూర్తయింది ఒక్కటి
- కరువైన అధికారుల పర్యవేక్షణ
- త్వరగా పూర్తిచేయాలంటున్న ప్రజలు


నిర్మాణంలో ఉన్న మార్కెట్

సంగారెడ్డి: ఒకే చోట మాంసం, చేపలు, కూరగాయల అమ్మకాలు జరుపుకునేందుకు సమీకృత మార్కెట్‌ల నిర్మాణానికి గత ప్రభుత్వం పూనుకుంది. వాటి వల్ల ప్రజలు అన్నీ ఒకేచోట కొనుగోలు చేసుకొనే వీలుంటుందని ప్రభుత్వం భావించింది. త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ పలు మున్సిపాలిటీలలో శంకు స్థాపనలు చేశారు. కాని ఇప్పటికీ వాటి నిర్మాణం పూర్తికాలేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. గత ప్రభుత్వం నిధులు మంజూరుచేసి టెండర్లు పిలిచింది. జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల పరిధిలోని పట్టణాల్లో ఈ పనులు ప్రారంభించారు. కాని జహీరాబాద్ మినహా ఎక్కడా నిర్మాణ పనులు పూర్తికాలేదు. గుత్తేదారుల అలసత్వం, అధికారులు నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపులో జాప్యంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో నిర్దేశించిన లక్ష్యం పూర్తికాకపోగా ప్రజల ఆశలు తీరడంలేదు.

ఇదీ.. నిర్మాణాల తీరు

జహీరాబాద్‌లో రూ.10కోట్లతో నిర్మాణం పూర్తయింది. సదాశివపేటలో రూ.5.5 కోట్లతో నిర్మాణాలు చేపడితే స్లాబుల వరకే పరిమితమయ్యాయి. అందోల్–జోగిపేటలో రెండు కోట్లతో పని మొదలు పెట్టినా పునాది స్థాయికే పరిమితమైంది. అదేవిధంగా అమీన్‌పూర్‌లో రూ.6.4కోట్లతో మొదలు పెట్టినా దానిదీ అదే పరిస్థితి. సంగారెడ్డిలో రూ.6.7కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. అవికూడా స్లాబ్‌ల వరకే పరిమితం అయ్యాయి. తెల్లాపూర్‌లో రూ.3.9, బొల్లారంలో రూ.6.5కోట్లతో పనులు ప్రారంభించినా అవి ఇంకా పిల్లర్ల దశలోనే ఉన్నాయి. నారాయణఖేడ్‌లో రూ.2.50కోట్లు మంజూరైనా ఇంకా పనులే ప్రారంభించలేదు.

నిబంధలనలకు నీళ్లు..

జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు ఏడాదిలోపు పూర్తి చేయాలని అప్పటి బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం నిబంధనలు విధించింది. పబ్లిక్ హెల్త్‌కు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు తొలుత ఆర్భాటంగా పనులు ప్రారంభించినప్పటికీ ఆ తర్వాత చేతులెత్తేశారు.

త్వరలో అందుబాటులోకి ...

మంత్రి దామోదర చొరవతో పనులు పూర్తయిన జహీరాబాద్ సమీకృత మార్కెట్ అందుబాటులోకి రానున్నట్లు తెలిసింది. ఇటీవల మంత్రి పర్యటనలో భాగంగా సమస్య మంత్రి దృష్టికి రాగా త్వరలోనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

బిల్లుల రాక నిలిచిన పనులు

జిల్లా వ్యాప్తంగా రూ.15కోట్ల పైగా బిల్లులు చెల్లిస్తేనే పనులు సాగే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాం. అన్ని చోట్లా పనులు పనులు ప్రారంభమయ్యాయి. కేవలం నారాయణ ఖేడ్‌లో స్థలసేకరణ జరగక ఆలస్యమవుతోంది. మంత్రి దామోదర సహకారంతో త్వరలో పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– వీర ప్రతాప్, ప్రజారోగ్యశాఖ ఈఈ

అందుబాటులోకి తీసుకురావాలి

సంగారెడ్డిలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తే మాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఒకే చోట అన్నీ దొరుకుతాయి. ఇప్పుడు ఒక్కో వస్తువు కొనుగోలు చేయడానికి ఒక్కోచోటుకు వెళ్లాల్సి వస్తోంది. మార్కెట్ అందుబాటులోకి వస్తే చాలా సమయం ఆదా అవుతుంది. అధికారులు స్పందించి ప్రజలు సమస్యలు తీర్చాలి.

– రాజమణి, సంగారెడ్డి

మున్సిపాలిటీకి ఆదాయం

పట్టణంలో సమీకృత మార్కెట్ ప్రారంభమైతే అధికారులకు కొంత పనిభారం తగ్గడంతో పాటు మున్సిపల్ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. వారంలో నాలుగు మార్కెట్లు కొనసాగుతుండడంతో సిబ్బందిని పంపాల్సి వస్తుంది. అలాగే మార్కెట్లలో చెత్తాచెదారం విచ్చలవిడిగా పారవేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి సహకారంతో త్వరగా పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తాం.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్

కందిలో చౌరస్తాలో ట్రాఫిక్ కష్టాలు

- ప్రమాదాలు.. టాఫిక్ జామ్‌లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కందిలోని జాతీయ రహదారిపైగల చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ చౌరస్తాను దాటేందుకు వాహన దారులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు ముంబయి– వెళ్లే జాతీయ రహదారి, మరోవైపు బెంగళూరు బైపాస్ రోడ్డుపై ఈ చౌరస్తా ఉండడంతో వాహనాలు 24గంటలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ చౌరస్తాకు రెండు వైపులా గ్రామం విస్తరించి ఉండడంతో ప్రజలు నిత్యం రోడ్డును దాటుతూ ఉంటారు. ఇప్పటికే రోడ్డుదాటే క్రమంలో పలు ప్రమాదాలు చోటు చేసుకొని చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈ చౌరస్తా మీదుగా బ్రిడ్జి నిర్మాణం కోసం సర్వేలు కూడా జరిపారు. ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డులో ఉన్న కట్టడాలను తొలగించేందుకు మార్కింగ్ చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఇద్దరు కానిస్టేబుళ్లు పని చేస్తున్నప్పటికీ తరచు ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ చౌరస్తాను విస్తరించి ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



చౌరస్తా వద్ద వాహనాల అవస్థలు

సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

బీజేపీ నాయకుడు ఓంకార్ యాదవ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో నిర్వహించే విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 29 నుంచి మండలంలో విజయ సంకల్పయాత్ర ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో రాహుల్, శ్రీకాంత్, రాము, ఓనంరెడ్డి, సంతోశ్‌రెడ్డి, మహేశ్, పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ..

జహీరాబాద్ టౌన్: విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆదివారం మండలంలోని అల్గోల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు జి.దుర్గయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కేంద్రం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని, జహీరాబాద్‌లో నిర్వహించే విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ రాష్ట్ర సభ్యులు అనిత పాటిల్, నాయకులు విశ్వనాథ్ యాదవ్, లక్ష్మారెడ్డి, రవీందర్, నింగన్న, వీరయ్య స్వామి, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.


జహీరాబాద్ టౌన్: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. 'ఇన్వెన్షన్ ఫర్ బెటర్ లివింగ్' అనే అంశంపై నిర్వహించిన ఈ ప్రదర్శనకు 27 పాఠశాలల నుంచి 120 నమూనాలు వచ్చాయి. న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్ డాక్టర్ రాధికాదేవి, డాక్టర్ కాశీనాథ్ ఎగ్జిబిట్లను పరిశీలించి విజేతలను ఎంపికచేసి బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిగా హాజరైన ప్రముఖ వ్యాపారవేత్త వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్స్ ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామిక్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శివబాబు, బి.రాంచందర్, అశోక్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పొంచి ఉన్న ప్రమాదం

పట్టించుకోని అధికారులు

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలో గల పస్తాపూర్ చౌరస్తా వద్ద ప్రమాదం పొంచి ఉంది. మురుగు కాలువల పనుల కోసం తవ్విన గుంత వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది నుంచి కాలువ పనులు చేపట్టకుండా గుంతలుతీసి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకొవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పస్తాపూర్ చౌరస్తా వద్ద నిత్యం రద్దీగా ఉంటుంది. సర్కిల్ నుంచి ఓ వైపు ఝరాసంగం మరో వైపు హైదరాబాద్‌కు వెళ్లేందుకు దారులు ఉన్నాయి. ప్రయాణీకులు కూడా బస్సుల కోసం అక్కడే ఎదురుచూస్తుంటారు. ఝరాసంగం వైపునకు వెళ్లే ఆటోలు కూడా ఇక్కడే ఆగుతాయి. రోడ్డు ఇరుకుగా ఉండి మూల మలుపు వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. జహీరాబాద్ నుంచి వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి గుంతలో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు. అధికారులు స్పందించి సర్కిల్‌లో వద్ద ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదాలకు కారణమైన కాలువ ఇదే..

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్

జహీరాబాద్ టౌన్: కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గ్రామిక్ భవనంలో ఆదివారం నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంతంలో ఉన్న అనేక పరిశ్రమల్లో ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. సంవత్సరాల తరబడి పనిచేస్తున్నా వారిని పర్మినెంట్ చేయకుండా శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యాలు కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్నాయని, కనీస వేతనాల జీవోలను ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన ఏ ఒక్కదానిలో కూడా కనీస వేతనాలు పెరిగే అవకాశంలేదని వాపోయారు. జీవోను సవరించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్టాలను అమలుచేయని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు నరేశ్, సందీప్‌రెడ్డి, విజయకుమార్, మల్లేశం, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: క్లీనర్ అదృశ్యం అవ్వడంపై డ్రైవర్ ఫిర్యాదు చేసిన ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఖుర్షీద్ అలీ కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన డ్రైవర్ జమేశ్ హెచ్.వాసవ, క్లీనర్ వాసవ కిరణ్ భాయ్ అశోక్ లేలాండ్ వాహనంలో లోడు తీసుకుని గుజరాత్ నుంచి సికింద్రాబాద్‌కు 19న వచ్చి అన్‌లోడ్ చేశారు. తిరిగి గుజరాత్ వెళ్లడానికి పటాన్‌చెరు మండలం ముత్తంగి సౌత్ మహారాష్ట్ర ట్రాన్స్ పోర్ట్ ఆఫీస్ వద్ద ఆగారు. ఈ క్రమంలో 21న ఉదయం దుకాణం దగ్గరకు వెళ్తొస్తానని డ్రైవర్‌తో చెప్పి వెళ్లిన క్లీనర్ తిరిగి రాలేదు. డ్రైవర్ చుట్టుపక్కల వెతకినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.


వాసవ కిరణ్ భాయ్(ఫైల్)

బయటకు వెళ్లి..

ద్విచక్ర వాహనం తీసుకొని బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. మండలంలోని ముత్తంగి శివారులోని ఆర్ఆర్ఆర్ నిర్మాణ సంస్థలో కడప జిల్లా ఆలంఖాన్ పల్లికి చెందిన గంగిరెడ్డి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. 23న ఆఫీస్ కార్యాలయంలో తన మొబైల్‌కి ఛార్జింగ్ పెట్టి, సంస్థకు చెందిన ద్విచక్ర వాహనాన్ని తీసుకొని బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి సోదరుడు గణేశ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


గంగిరెడ్డి(ఫైల్)

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పాఠశాలలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 2009–10 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఆనాటి తమ ఉపాధ్యాయులతో మాట్లాడి పాత రోజులను గుర్తు చేసుకున్నారు.

క్లుప్తంగా

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి మండల పూజల్లో భాగంగా పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవస్థానం, చైతన్య నగర్ కాలనీలోని మహాదేవుని ఆలయంలో సోమవారం ఉదయం 6గంటలకు పంచామృత అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు మహేశ్, ఓంకార్ తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం శివ స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

కార్మికులకు అండగా ఉంటాం

ఐఎన్‌టీయూసీ నాయకుడు శివసాయి


మాట్లాడుతున్న శివసాయి

జిన్నారం(పటాన్‌చెరు): కార్మికులకు ఎలాంటి కష్టాలు వచ్చినా వారికి అండగా ఉంటామని ఐఎన్‌టీయూసీ బొల్లారం మున్సిపల్ అధ్యక్షుడు శివసాయి చెప్పారు. ఆదివారం సంస్థ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, ఇమ్రాన్, సంతోష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): ఉపాధి హామీ పథకంలో మంజూరైన రూ.60 లక్షలతో బుదేరా పోలీస్ స్టేషన్ నుంచి మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల వరకు సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీపీలు రాజేశ్వరరావు, రాంరెడ్డి ప్రారంభించారు. ఆదివారం బుదేరా గ్రామ చౌరస్తా సమీపంలో పోలీస్ స్టేషన్, ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల లింకు రోడ్లకు సీసీ రోడ్డు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో సీసీ రోడ్డు పనులు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దుర్గయ్య, పిల్లోడి సర్పంచ్ సతీశ్ కుమార్, మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి, తాటిపల్లి సర్పంచ్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి


నూతన కమిటీ సభ్యులతో జగన్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల పూర్తిస్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కృష్ణ, రాజుగౌడ్, సుధాకర్, సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్, రాజుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింగ్‌రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గం

జహీరాబాద్ టౌన్: విశ్వహిందూ పరిషత్ జహీరాబాద్‌శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాంతినగర్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడుగా క్షీరసాగర్ సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జీవన్‌జైన్, ఉపాధ్యక్షుడుగా రఘుకాంత్‌ను ఎన్నుకున్నారు. అలాగే భజరంగ్‌దళ్ నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడుగా గాజుల మోహన్, కార్యదర్శిగా రాజేశ్, ఉపాధ్యక్షుడుగా జగదీశ్, దశరథ్, ప్రదీప్, ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా బొల్గరి ఆకాశ్, గోరక్ష ప్రముఖ్‌గా జంగ్బి రమేశ్, విద్యార్థి ప్రముఖ్‌గా కమ్మరి విగ్నేశ్‌ను ఎన్నుకున్నారు.

◆ పోచమ్మ అమ్మవారికి బోనాలు

మునిపల్లి(అందోల్): పోచమ్మ అమ్మవారికి భక్తులు బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మండలంలోని బుదేరా కాలనీలో పోచమ్మ అమ్మవారికి బోనాల పండుగ నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల విన్యాసాలు జోరందుకున్నారు. అనంతరం అమ్మవారికి భక్తులు నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

◆ ఉత్సాహంగా వార్షికోత్సవం

పటాన్‌చెరు: మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థలు విద్యార్థులను తీర్చిదిద్దుతూ ఉత్తమ విద్యకు చిరునామగా నిలుస్తున్నాయని విద్యాసంస్థల చైర్మన్ రాజు సంగాని తెలిపారు. ఇంద్రేశం గ్రామంలో శనివారం సాయంత్రం డైరెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. మాజీ సర్పంచ్ నర్సింలు, రామేశ్వరంబండ మాజీ సర్పంచ్ ధరణి, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి, డైరెక్టర్లు నాగరాజు, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా చిత్తారమ్మ జాతర



జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని సోలక్‌పల్లి గ్రామంలో చిత్తారమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ స్వాతితో పాటు నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ జాతర్లతో ఆధ్యాత్మిక వాతావరణం

పటాన్‌చెరు టౌన్: జాతర్ల నిర్వహణతో గ్రామాల్లో



ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంటుందని పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కర్దనూర్ గ్రామంలో జరుగుతున్న మల్లన్న స్వామి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా విశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన

కోహీర్(జహీరాబాద్): ఖస్బా వీధిలో నూతనంగా నిర్మించిన విశ్వేశ్వర ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం హోమం నిర్వహించి విశ్వేశ్వర స్వామి విగ్రహంతో పాటు గణపతి, నాగదేవత, భద్రకాళి, వీరభద్రేశ్వర స్వామి, నంది విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భారీ ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఉదయం 11.30కు విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామి సర్వదర్శనం, తీర్థప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

◆ జీవన్ముక్త సంస్థానంలో ఆరాధన

మునిపల్లి(అందోల్): జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులు, జీవన్ముక్త మహరాజ్‌కు పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరాధనలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

◆ ఘనంగా వెన్నెల భోజన వేడుకలు



జహీరాబాద్ టౌన్: స్థానిక దత్తగిరి కాలనీలో గల బసవ మండపంలో శనివారం రాత్రి వెన్నెల భోజన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహాత్మ చెన్నబసవన్న వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బసవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చెన్న బసవన్నకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. మహిళలు, పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వెన్నెల్లో అందరూ కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ జహీరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ ఔషధ గుణం కలిగిన వేపకు తెగులు

జహీరాబాద్ టౌన్: ఔషధ గుణాలున్న వేపచెట్లు కూడా తెగులు బారిన పడుతున్నాయి. గత రెండు సంవత్సరాల నుంచి జహీరాబాద్ ప్రాంతంలో చెట్లన్నీ ఎండుతున్నాయి. గత సంవత్సరం కూడా ఇలాగే వేపచెట్లు తెగుళ్ల సోకి ఎండిపోయి ఆ తరువాత చిగురించి మాములు స్థితికి వచ్చాయి. ఈ సారి కూడా అధిక శాతం వేపచెట్లు ఎండుతున్నాయి. రోడ్డు పొడువునా, పొలాల గట్లపైనా ఎండిన చెట్లు కనిపిస్తున్నాయి. వేపచెట్లు ఎండిపోవడం గతంలో ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు.

◆ 250 మందికి వైద్య పరీక్షలు

నారాయణఖేడ్: నిజాంపేటలో ఆదివారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలోని నవ్యశివదత్త ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు అనిల్ గౌడ్, కర్మిష్మ, సిబ్బంది నవీన్ గౌడ్, నిఖిల్, శ్రీనివాస్, మహానంద తదితరులు సుమారు 250మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ జగదీశ్వరాచారి, మాజీ ఉపసర్పంచ్ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.